క్లుప్తంగా

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: ర్యాగింగ్ వల్ల జీవితాలు నాశనం అవుతాయని, తోటి విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగాలని నల్లపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. శనివారం గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నైతిక విలువలతో నిజాయితీగా ఉండాలని లఘు నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య, వైస్ ప్రిన్సిపల్ ఆర్ షారూన్ రోజ్, కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ జె.ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



కాకుమాను: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎంఈవో కె.ఎఫ్.కెనడీ పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం తప్పని సరిగా ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు.

నిత్యావసరాల పంపిణీ



గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి సమాజ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో విద్యార్థులను ఆయన అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సత్తెనపల్లిలోని పరివర్తన స్పీచ్ థెరపీ సెంటర్ నందు అనాథ పిల్లలకు నెలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడూ చేస్తూ ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు నాగ గోపి పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సర్వేయర్ల అభినందన



భట్టిప్రోలు: ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన గుమ్మా చంద్రశేఖరరావును మండల సర్వేయర్ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సర్వేయర్లు శనివారం అభినందించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడి నుంచి కృష్ణా జిల్లా మొవ్వ మండలానికి చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. తిరిగి బాధ్యతలు చేపట్టిన ఆయనను సర్వేయర్లు ఘనంగా సన్మానించారు.

ఎరువుల దుకాణం తనిఖీ



పెరవలిపాలెం(వేమూరు): అనుమతులు లేకుండా ఎరువులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత హెచ్చరించారు. మండల కేంద్రంలోని పెరవలిపాలెంలో ఉన్న లక్ష్మీ శ్రీనివాస సీడ్స్ దుకాణంలో శనివారం తనిఖీ చేశారు. బిల్లు పుస్తకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రత్నప్రసాద్, గ్రామ వ్యవసాయాధికారి నాగూర్ వలీ, వీరా శేఖర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గుంటూరు రూరల్: వాహన చోదకులు ప్రభుత్వ ప్రమాణాలు పాటించి నిబంధనల ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణం చేయాలని నల్లపాడు పోలీసు స్టేషన్ సీఐ వంశీధర్ తెలిపారు. శనివారం స్టేషన్ పరిధిలోని వై జంక్షన్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, హౌసింగ్ బోర్డు, ఎనిమిది ప్రాంతాల్లో నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ నిబంధనల ప్రకారం హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. ఇన్సూరెన్సు, వాహన పత్రాలు లేని వాహనాలపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు.

ప్రాణాలు పోసే వైద్యులకు రక్షణ ఏదీ.?

- ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం డీడీవో డాక్టర్ జి. అఖిల్ రత్నం
- కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్య ఘటనపై నిరసన



ప్రత్తిపాడులో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

ప్రత్తిపాడు: తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి రోగులకు ప్రాణం పోసే వైద్యులకు రక్షణ ఎక్కడ ఉందని, తెల్ల కోటుకు రక్తపు మరకలు అంటడం సిగ్గుచేటని ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం డీడీవో డాక్టర్ జి. అఖిల్ రత్నం అన్నారు. కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కళాశాలలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యను నిరసిస్తూ నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శనివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐఎంఏ పిలుపు మేరకు శనివారం వైద్యులు సాధారణ వైద్య సేవలను బహిష్కరించారు. అనంతరం సిబ్బందితో కలిసి స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మెయిన్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. నో సేఫ్టీ నో డ్యూటీ, సేవ్ ద సేవియర్స్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నిందితులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు నాగార్జున, కె.మౌనిక, డి. విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేబ్రోలులో నిరసన

పెదకాకాని: కోల్‌కతాలోని జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను డాక్టర్ అబ్రహాం లింకన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు వైద్యాధికారులు డాక్టర్ అబ్రహం లింకన్ డాక్టర్ శైలజ, వైద్య సిబ్బంది శనివారం నిరసన తెలియజేశారు.



సిబార్ దంత వైద్య కళాశాలలో విద్యార్థుల ర్యాలీ

అత్యాచారాలు, హత్యలు సిగ్గుచేటు

పెదకాకాని: స్త్రీని శక్తిగా పూజించే దేశంలో అమానవీయమైన, క్రూరమైన చర్యలు జరగడం సిగ్గు చేటని సిబార్ కళాశాల విద్యార్థులు ముక్త కంఠంతో ఖండించారు. మండలంలోని సిబార్ దంత వైద్య కళాశాలలో ఆర్‌జీ కర్ మెడికల్ కళాశాలలో జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ తక్కెళ్ళపాడు గ్రామ పంచాయతీ ఆఫీసు వరకు కొనసాగింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే చట్టాలకు పదును పెట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ వి.రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



చేబ్రోలు పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది నిరసన

నమూనాలకే పరిమితం చేయకండి

విజ్ఞాన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఇంక్యుబేషన్ మేనేజర్ అబ్దుల్ రియాజ్

ప్రత్తిపాడు: విద్యార్థులు రూపొందించే ప్రయోగాలను నమూనాలకే పరిమితం చేయకుండా రియల్ టైం ప్రాజెక్టులుగా వృద్ధి చెందే వరకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని విజ్ఞాన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఇంక్యుబేషన్ మేనేజర్ అబ్దుల్ రియాజ్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆగస్టు 8 నుంచి జరుగుతున్న 36 గంటల ఐవోటీ హ్యాకథాన్ శనివారంతో ముగిసింది. 36 గంటల్లో 32 మంది గ్రూప్ సభ్యులు ప్రపంచంలో వివిధ రంగాల్లో సామాన్యులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే సాంకేతిక విభాగం ద్వారా పరిష్కార మార్గాలను నమూనాల రూపంలో రూపొందించారు. ముఖ్య అతిథి అబ్దుల్ రియాజ్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారాలను నమూనాల రూపంలో విద్యార్థినులు చేసిన ప్రదర్శనలు వినూత్నంగా ఉన్నాయన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ భవిష్యత్తు ఐవోటీ రంగానిదేనన్నారు. విద్యార్థినులు అకడమిక్స్‌తో పాటు ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ఎదగాలంటే నైపుణ్యాలు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి.విజయ సారథి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు

సర్ రామ్‌నాథ్ చోప్రా స్మారక వేడుకలు

గుంటూరు రూరల్: భారతీయ ఔషధ నిపుణుడు, పరిశోధకుడు, వైద్య రంగానికి గణనీయమైన కృషిచేసిన మహనీయుడు సర్ రామ్‌నాథ్ చోప్రా అని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫార్మాకాలజీ సర్ రామనాథ్ చోప్రా స్మారక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారతీయ మొక్కలు, ఔషధ లక్షణాలపై సమగ్ర సమాచారం అందిస్తూ మెటీరియా మెడికా ఆఫ్ ఇండియన్ డ్రగ్స్ అనే పుస్తకాన్ని ఆయన రచించినట్లు తెలిపారు. అది వైద్య రంగానికి వనరుగా మారిందన్నారు. సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ బోనమ్ శ్రీనివాస రెడ్డి, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొని యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పించిన అధ్యాపకులు

వాణిజ్య సముదాయం.. కనిపించని ఆదాయం

- మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం.. ఖాళీగా వ్యాపార దుకాణాలు
- పొన్నూరు పురపాలిక ఆదాయానికి భారీగా గండి

పొన్నూరు: పొన్నూరు పట్టణంలో వ్యాపార నిమిత్తం చిన్న గదిని అద్దెకు తీసుకోవాలంటే నెలకు రూ. వేలల్లో చెల్లించాలి. ప్రధాన సెంటర్‌లో అయితే కొన్ని నెలల అద్దెను ముందుగానే చెల్లించాలి. నెలకు రూ.20 నుంచి రూ.50 వేలు వరకు అద్దె ఉంటుంది. అటువంటి సెంటర్లలోని మున్సిపల్ దుకాణాలు కొన్ని నెలలుగా మూతబడే ఉంటున్నాయంటే మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థమవుతోంది. పురపాలక వ్యాపార సముదాయాల సమీపంలో ప్రైవేటు వ్యక్తులు కొందరు నిబంధనలను పక్కకు నెట్టి డ్రెయిన్లను కప్పి దుకాణాలు నిర్మించి రూ.లక్షలు ఆదాయం ఆర్జిస్తున్నారు. కానీ, పురపాలక సంఘానికి చెందిన వ్యాపార దుకాణాలు ఖాళీగా ఉన్నాయంటే అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు. లక్షల రూపాయలు ఆదాయం సమకూర్చే దుకాణాలకు అధికారుల ఆదరణ కరువై నిరుపయోగంగా మారాయి. నెలల తరబడి ఖాళీగా ఉన్న దుకాణాలకు టెండర్లు పిలవకపోవడం పట్ల వ్యాపారుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

నిర్లక్ష్యం కారణంగా కోల్పోతున్న ఆదాయం

పట్టణ పరిధిలోని ప్రధాన సెంటర్లలో నాలుగు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 140 వ్యాపార దుకాణాలు పురపాలక సంఘ పరిధిలో ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి రూ.కోటి అద్దెల రూపంలో రావాల్సి ఉంది. కానీ మున్సిపల్ రెవెన్యూ విభాగంలో నిర్లక్ష్యం కారణంగా ఆదాయానికి గండి పడుతోంది. ప్రధాన సెంటర్లలో నెలకు రూ. 50 వేలకు పైగా అద్దెలు వచ్చే కొన్ని వ్యాపార దుకాణాలు ఖాళీగా ఉన్నాయంటే అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు. పదుల సంఖ్యలో ఖాళీగా ఉన్న దుకాణాలకు ఎప్పటికప్పుడు టెండర్లు నిర్వహించి, లీజుదారులకు కేటాయించి అద్దె రూపంలో ఆదాయం సమకూర్చుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన దుకాణాలు కావడంతోనే వాటిని ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

మెయిన్ రోడ్డుపై అధ్వానంగా..

రంగులు లేకుండా.. దుమ్ము, చెత్తతో నిండిపోయి.. కూరగాయల మార్కెట్ సెంటర్‌లో మెయిన్‌రోడ్డుపై శిథిలస్థితికి చేరుతున్న భవనాలను చూడగానే ఇవి పురపాలక వాణిజ్య భవన సముదాయాలని ఇట్టే చెప్పుకోవచ్చు. పురపాలక సంఘానికి బంగారు బాతుల్లాంటి వ్యాపార సముదాయాలకు వెంటనే టెండర్లు నిర్వహిస్తే మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఆ విషయం తెలిసినా పట్టించుకునేవారు లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి భారీగా ఆదాయం సమకూర్చే దుకాణాలకు వెంటనే టెండర్లు నిర్వహించాలని వ్యాపారులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న కొప్పాక వెంకయ్య కాంప్లెక్స్ దుకాణాలు



ఖాళీగా ఇందిరా గాంధీ కాంప్లెక్స్‌లోని దుకాణాలు

వరి గడ్డివామి దగ్ధం



పిట్టలవానిపాలెం:ప్రమాదవశాత్తూ పది ఎకరాల వరి గడ్డి వామి దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..మండలంలోని ఖాజీపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి నరసింహరావుకు చెందిన వరి గడ్డి వామి శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. స్థానికులు స్పందించి మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం రేపల్లె పట్టణంలో స్థలం కేటాయించాలని సంఘ అధ్యక్షుడు జానం మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన సముదాయం ఏర్పడితే దివ్యాంగుల సమస్యలను నిరంతరం తెలుసుకునేందుకు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దివ్యాంగుల ఏడీ కార్యాలయం ఒంగోలు పట్టణంలో ఉందని, వివిధ పనులపై అక్కడికి వెళ్లాలంటే కష్టతరంగా ఉందని తెలిపారు. బాపట్ల జిల్లా ఏర్పడి నేపథ్యంలో ఏడీ కార్యాలయాన్ని జిల్లా కేంద్రం లేదా రేపల్లె పట్టణంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



అద్దేపల్లి(భట్టిప్రోలు):స్వాతంత్ర్యోద్యమంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ నీలం దేవరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆగస్టు 15న అద్దేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం ఎంఈఓ దేవరాజు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జ్ఞానం చదువుతో మాత్రమే అందుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పిన విషయాలను వినడం, నేర్చుకోవడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు పి. మనోజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, ఎస్ఎంసీ చైర్మన్ మాధురి, వైస్ చైర్మన్ అమ్రేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే శాఖాపరమైన చర్యలు

వీఆర్వోలకు తహసీల్దారు రవిబాబు హెచ్చరిక

ప్రత్తిపాడు: రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, కానీ కొందరు రైతులు సచివాలయాలకు వెళితే వీఆర్వోలు వద్దంటున్నారని, వాళ్లను అడిగి నాలుగైదు రోజుల తర్వాత దరఖాస్తు చేసుకోమని చెప్పి.. వెనక్కు పంపుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నట్లు తహసీల్దార్ కె.రవిబాబు తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని, ఇకపై ఇలాంటి ఫిర్యాదులొస్తే.. ఉపేక్షించేది లేదేని, శాఖ పరమైన చర్యలు ఉంటాయని వీఆర్వోలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం రెవెన్యూ సమస్యలు, పెండింగ్ అర్జీలపై వీఆర్వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పెండింగ్ అర్జీలను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలు పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని తహసీల్దారు ఆదేశించారు. ఎప్పటికప్పుడు విచారణ త్వరితిగతిన పూర్తి చేసి, నిర్ణీత కాల వ్యవధిలో నివేదికలు అందజేయాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, సీసీఆర్ కార్డులు మంజూరు మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఆర్ఐ సాహితి, వీఆర్వోలు పాల్గొన్నారు.

విష జ్వరాలకు మురుగు నీరే కారణమా..?

బాపట్లటౌన్: గడిచిన పది రోజులుగా ముత్తాయపాలెం గ్రామంలో వర్షాలు కురవలేదు. వీధుల్లో వర్షపునీరు నిలిచింది లేదు. గ్రామంలోని మురుగునీరు పేరుకుపోయిన దాఖలాలు లేవు.... కానీ ఊరంతా విష జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. ఇందుకు గ్రామ శివారులోని రెస్టారెంట్ సమీపంలో ఏళ్ల తరబడి నిలిచిన మురుగు నీరే కారణమని గ్రామస్తులు ముక్త కంఠంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు తాగడం వల్ల గ్రామంలోని 30కి పైగా సూడి గేదెలు ఈసుకుపోయాయి. ఎన్నిసార్లు రెస్టారెంట్ నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ముత్తాయపాలెం శివారులో ఏర్పాటు చేసిన లోటస్ పాండ్ రిసార్ట్స్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు వేస్ట్ వాటర్ను ముందు భాగంలోని పంట పొలాలకు సాగునీరు అందించే బోదె కాలువలోకి వదులుతున్నారు. రిసార్ట్స్ ఏర్పాటు చేసి సుమారు 12ఏళ్లు అవుతోంది. అప్పటి మురుగు నీరంతా ఇందులోకి వదులుతున్నారు. దీంతో దోమల ఉధృ విపరీతంగా పెరిగిపోయింది. బోదె కాలువలో మునిగిన గేదెలు గ్రామంలోకి రావడంతో దోమల వ్యాప్తి అధికమైంది. దీంతో ఎన్నడూలేని విధంగా ఊరంతా విషజ్వరాలు వ్యాపించాయని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామంలోని నక్కల శ్రీనివాసరావుకు చెందిన రెండు గేదెలు, సుబ్బారావుకు చెందిన మరో రెండు ఆరు నెలల సూడి గేదెలు ఈ మురుగు నీరు తాగి ఈసుకుపోయాయి. ఇప్పటికీ సుమారు 30 గేదెలకు ఈసుకు పోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీపీఓ వి.రవికుమార్ స్పందిస్తూ.. వ్యర్థాలను పంట పొలాల్లోకి వదులుతున్న రెస్టారెంట్ యజమానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మురుగునీటిని వెంటనే తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు ఇస్తామన్నారు. అయిల్ బాల్స్ స్ప్రే చేయిస్తామని వివరణిచ్చారు.



లోటస్‌పాండ్ రిసార్ట్స్ సమీపంలో నిలిచిన మురుగు నీటిలో గేదెలు

కోరం లేకుండా ఎస్ఎంసీ ఎన్నికలెలా జరిపారు

తిక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎంను ప్రశ్నించిన సర్పంచ్, తల్లిదండ్రులు

ప్రత్తిపాడు: కోరం లేకుండా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఎలా జరిపారంటూ తిక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణకుమారిని సర్పంచ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ప్రశ్నించారు. పాఠశాలలో మొత్తం 72 మంది విద్యార్థులు ఉండగా వారిలో 58 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉందని, కానీ ఎన్నికల రోజున కేవలం పాఠశాలకు వచ్చింది 25 మంది మాత్రమేనని, మరి కోరం ఎలా సరిపోయిందని నిలదీశారు. తరగతుల వారీగా కోరం జరపాల్సి ఉండగా, అన్ని తరగతులను ఒకే చోట కూర్చోబెట్టి కోరం ఉన్నట్లుగా చూపే ప్రయత్నం చేయడం ఏ నిబంధనల్లో ఉందని ఎండగట్టారు. సంతకాలు కూడా ఇళ్లకు రిజిస్టర్లు తీసుకుని వెళ్లి చేయించుకున్నారని ఆరోపించారు. స్పందించిన ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణకుమారి తన అనారోగ్య సమస్యల కారణంగా, ఆ రోజు మరో ఇన్‌చార్జి హెచెఎం వెంకటేశ్వరరావు ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.



ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణకుమారిని ప్రశ్నిస్తున్న సర్పంచ్, తల్లిదండ్రులు

సంక్షిప్త ఓటర్ల జాబితాను రూపొందించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: సంక్షిప్త ఓటర్ల జాబితాను రూపొందించేందుకు బీఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్వోలతో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. తప్పొప్పులు లేని నిర్దిష్టమైన ఓజాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఈ నెల 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్వోలు తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయాలని చెప్పారు. సర్వేలో వచ్చిన అభ్యంతరాలపై అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఉంటాయన్నారు.

ప్రొటోకాల్‌కు ప్రాధాన్యమివ్వాలి

ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: ప్రొటోకాల్ ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని, ప్రతి విషయంలో అధికారులు ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని అప్పుడే శాఖ పరంగా సమాచారం తెలుస్తుందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి, మాట్లాడారు. ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు జరపరాదన్నారు. ఆయా శాఖల అధికారులు సమావేశానికి రాకుండా తమ కిందిస్థాయి అధికారులను పంపడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అధికారుల గైర్హాజరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో చంద్రశేఖరరావుకు సూచించారు. అధికారులు బాధ్యతతో పని చేసి, మండలాభివృద్ధికి పాటు పడాలని కోరారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. అనంతరం కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి, పక్కన ఎంపీడీవో, జెడ్పీటీసీ

పాఠశాలలను బలోపేతం చేయాలి

చింతాయపాలెం(కర్లపాలెం):ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సమగ్ర శిక్ష సహాయ పర్యవేక్షణ అధికారి బి.మోజెస్ పేర్కొన్నారు. శనివారం చింతాయపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన పాఠశాలల సముదాయాల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యాంజలి పోర్టల్‌లో పాఠశాలల అవసరాలను నమోదు చేయాలన్నారు. ఎంఈవో విద్యాశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వెంకటరాజు, ఇ.పోలీస్‌రావు, పరిశుద్ధరావు, ఉషాకిరణ్, గుడారంకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష పర్యవేక్షణ అధికారి మోజెస్